ప్రజాశక్తి
మంగళవారం 5 నవంబర్ 2024
5
పార్వతీపురం మన్యం

పత్తి కొనుగోలుకు చర్యలు : జెసి

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో పండించిన పత్తిని రామభద్రపురం మండలంలో గల ప్రాతూ జిన్నింగ్ మిల్లు వద్ద విక్రయించాలని జాయింట్ కలెక్టర్ శోభిక ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు బాగా ఆరబెట్టి దుమ్ము, ధూళి లేకుండా పత్తిని తీసుకెళ్లాలని కోరారు. సిసిఐ నిబంధనలకు లోబడి పత్తి ఉంటే రైతులకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర లభిస్తుందని చెప్పారు. పొడవు గింజ పత్తి క్వింటాకు రూ.7500, పొట్టి గింజ పత్తి క్వింటాకు రూ.7121 మద్దతు ధరగా చెల్లించనున్నట్లు తెలిపారు. తేమ శాతం 8లోపు ఉంటే ఒక్కో శాతానికి రూ.75 మద్దతు ధరలో తగ్గించనున్నట్లు తెలిపారు. ఆధార్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకం, బ్యాంక్ ఖాతా పుస్తకం జెరాక్స్ కాపీలను సమీపంలో ఉన్న రైతు సేవా కేంద్రాలకు తీసుకెళ్లి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు.

వైసిపి ఎమ్మెల్సీ అభ్యర్థిగా శంబంగి? గొర్లె?

- ఆశలపల్లకిలో మరికొందరు మాజీ ఎమ్మెల్యేలు
- అభ్యర్థి కోసం టిడిపి వెతుకులాట?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

వైసిపి ఎమ్మెల్సీ అభ్యర్థిగా బొబ్బిలి మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకటచినఅప్పలనాయుడు లేదా జామి మండల పార్టీ అధ్యక్షులు గొర్లె రవి కుమార్ పేర్లు వినిపిస్తున్నాయి. నెల్లిమర్ల, విజయనగరం, కురుపాం నియోజకవర్గాలకు చెందిన మాజీ ఎమ్మెల్యేలు బడ్డుకొండ అప్పలనాయుడు, కోలగట్ల వీరభద్రస్వామి, పాముల పుష్ప-శ్రీవాణి కూడా సీటు కోసం ఆశపడుతున్నట్లుగా తెలుస్తోంది. వైసిపికి స్పష్టమైన మెజార్టీ ఓటింగ్ ఉండడంతో టిడిపి తరపున పోటీచేసేందుకు ముందుకు వచ్చేందుకు వెనుకాడుతున్నారు. అయితే, వైసిపి అభ్యర్థిని బట్టి ఎవరినైనా పోటీకి దింపాలా లేక విశాఖలో మాదిరిగా పోటీ నుంచి తప్పుకోవాలన్న అన్న అంశాన్ని నిర్ణయించుకునే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలోని 34 మండలాల (9అసెంబ్లీ నియోజకవర్గాలు) పరిధిలో ఈ ఎన్నిక జరగనుంది.

ఈ లెక్కన జిల్లాలో 549 ఎంపిటిసి, 34 జెడ్పీటిసి, 160 కౌన్సిలర్లు, కార్పొరేటర్, 9 నియోజకవర్గ స్థానాలు ఉన్నాయి. ఈ లెక్కన మొత్తం 743 మంది ఓటర్లు కాగా, ఇందులో 9మంది ఎంపిటిసి సభ్యులు రాజీనామా చేయడంతో ఆ స్థానాలు ఖాళీగా ఉన్నాయి. వీరిలో వైసిపికి చెందిన వారు 578 మంది, టిడిపికి చెందిన ఓటర్లు 155 మంది ఉన్నారు. ఒకరు ఇండిపెండెంట్, 9 మంది రాజీనామా చేయడం లేదా, మృతి చెందారు. ఈ నేపథ్యంలో వైసిపి నుంచి ఆశావహులు ఎక్కువ మందే ఉన్నారు. ఇప్పటికే విశాఖ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పదవిని మన జిల్లాకు చెందిన మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ కట్టబెట్టిన సంగతి తెలిసిందే. పార్టీ తరపున శాసన మండలి ప్రతిపక్ష నేతగా కూడా అవకాశం లభించింది. ఈనేపథ్యంలో ఈసారి ఇతర సామాజికవర్గానికి అవకాశం కల్పించాలని పార్టీ భావించినట్టుగా తెలిసింది. ఇదే ఖాయమైతే బడ్డుకొండ అప్పలనాయుడు ఆశపడుతున్నప్పటికీ అవకాశం దక్కకపోవచ్చనే ప్రచారం జరుగుతోంది. విజయనగరం జిల్లాకు చెందిన బొత్సకు విశాఖలో అవకాశం ఇచ్చిన నేపథ్యంలో ఈసారి పార్వతీపురం జిల్లాకు ఇవ్వదలిస్తే తమకు అవకాశం పుష్పశ్రీవాణి కోరుతున్నట్టుగా చర్చనడుస్తోంది. కోలగట్ల కూడా అవకాశం కోసం ఎదురు చూస్తున్నట్టు నగరంలోని ఆ పార్టీ నాయకుల నోట వినిపిస్తోంది. వాస్తవానికి ఇప్పటికే బొత్సకు అవకాశం ఇచ్చినందున ఉమ్మడి జిల్లాలో మెజార్టీ జనాభాగల ఇతర సామాజికవర్గానికి ఇవ్వాలని నిర్ణయానికి పార్టీ వచ్చినట్టుగా సమాచారం. ఈలెక్కన బొబ్బిలి, ఎస్.కోట మాజీ ఎమ్మెల్యేలు శంబంగి వెంకట చినప్పల నాయుడు, కడుబండి శ్రీనివాసరావు పేర్లు పరిశీలనకు వచ్చినట్టు తెలిసిందే. వీరిలో కడుబండి ఇప్పటికే సున్నితంగా తిరస్కరించడంతో పాటు గత ఎన్నికల్లో పార్టీ కోసం పనిచేసిన గొర్లె రవికుమార్ పేరును పరిశీలించాలని పార్టీకి సూచించారని తెలిసింది. దీంతో, రవికుమార్‌తో ఇప్పటికే గజపతినగరం మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య మాట్లాడారని, ఆ తరువాత శాసన మండలి నేత బొత్స సత్యనారాయణను రవికుమార్ కలిశారని వారి అనుచరులు చెబుతున్నారు.

అవకాశమిస్తే పోటీ చేస్తాం : పతివాడ

అధిష్టానం అవకాశమిస్తే స్థానిక సంస్థల ఎమ్మెల్సీ టిడిపి అభ్యర్థిగా తమ కుంటుంబం నుంచి పోటీ చేస్తామని మాజీ మంత్రి పతివాడ నారాయణస్వామి నాయుడు కుమారుడు పతివాడ అప్పలనాయుడు తెలిపారు. తన తండ్రి నారాయణస్వామినాయుడు జిల్లాలో ఎవరికీ పరిచయం అక్కర లేదన్నారు. తాము పార్టీకి విదేయులమని,తమ కుటుంబం పార్టీ కోసం ఆహర్నిశలూ పనిచేస్తోందని అన్నారు. అధిష్టానం తమకు అవకాశం ఇవ్వాలని కోరారు.

నాయకుల విగ్రహాలకు ముసుగు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక సంస్థల శాసనమండలి ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎ.శ్యాంప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. అయినప్పటికీ కురుపాంలో అధికారులు మాత్రం కలెక్టర్ ఆదేశాలను తుంగలో తొక్కారనడానికి నిదర్శనంగా మండల కేంద్రంలో గల వైఎస్ఆర్, ఎన్‌టిఆర్ విగ్రహాలకు కనీసం ముసుగులు తొడగని పరిస్థితి ఉంది. దీనిపై సోమవారం ప్రజాశక్తి పత్రికలో వెలువడిన వార్తకు మండల అధికారులు వెంటనే స్పందించి ఆ విగ్రహాలకు ముసుగులను కప్పించి ఎన్నికల నియమాలు పాటించారు.

183 కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు

వెంటనే ప్రారంభించాలి : కలెక్టర్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో 183 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరణకు చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాత్ తెలిపారు. వెంటనే ధాన్యం కొనుగోలు ప్రారంభించాలని, ఇందుకు సంబంధించిన సిబ్బందికి శిక్షణ తక్షణమే ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. సంబంధిత అధికారులతో సోమవారం కలెక్టర్ సమీక్షించారు. ధాన్యం సేకరణను సబ్ కలెక్టర్లు నిశితంగా పర్యవేక్షించాలని, మిల్లర్లు బ్యాంకు గ్యారంటీ ఇవ్వాలని అన్నారు. వాహనాల రిజిస్ట్రేషన్ పక్కాగా జరగాలని, తహశీల్దార్లు, ఉప తహశీల్దార్లు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ చేయాలన్నారు. గన్నీ బ్యాగులు సిద్ధం చేయాలన్నారు. జిల్లాలో ధాన్యం దిగుబడులు ప్రారంభమయ్యాయని, 2.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం రావచ్చని అంచనా ఉందని చెప్పారు. 183 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరణకు చర్యలు చేపడుతున్నామని అన్నారు. ప్రభుత్వం ఎ - గ్రేడ్ రకం ధాన్యానికి రూ. 928 (40 కిలోలు), రూ.1856 (80 కిలోలు), రూ.2320 (క్వింట), రూ.23200 (మెట్రిక్ టన్ను) సాధారణ రకానికి రూ.920 (40 కిలోలు), రూ.1840 (80 కిలోలు), రూ.2300 (క్వింట), రూ.23000 (మెట్రిక్ టన్ను)గా మద్దతు ధరగా ప్రకటించిందన్నారు.

ధరల నియంత్రణకు కమిటీ

ధరల నియంత్రణకు జిల్లా స్థాయి కమిటీ ఏర్పాటు చేసినట్టు కలెక్టర్ చెప్పారు. ప్రతి రోజు ధరల నియంత్రణకు పర్యవేక్షణ జరుగుతోందన్నారు. దుకాణాలు ధరల సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని, అధిక ధరలకు విక్రయించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. సమావేశంలో సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ పి.శ్రీనివాసరావు, డిఆర్‌డిఎ పిడి వై.సత్యంనాయుడు, జిల్లా ఉద్యాన అధికారి కెవిఎస్ వరప్రసాద్, జిల్లా సహకార అధికారి పి.శ్రీరామ్మూర్తి, జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్‌పాల్, జిసిసి డిఎం వి.మహేంద్ర కుమార్ పాల్గొన్నారు.

వరద బాధితులకు సహాయ నిధి

కలెక్టర్‌కు అందజేసిన రైతు సంఘం నాయకులు
ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

కలెక్టర్‌కు వరద సహాయ నిధిని అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి - పార్వతీపురం

విజయవాడ తుపాను వరద బాధితులకు సహాయ నిధి నిమిత్తం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో పార్వతీపురం మండలం అడ్డాపుశిలలో సమీకరించిన రూ.62,570లను కలెక్టర్ శ్యాంప్రసాద్‌కు సోమవారం అందించారు. అలాగే ఈ ఖరీఫ్ సీజన్ రైతులు దళారీల బారిన పడకుండా వెంటనే జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని కలెక్టర్‌కు వినతి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో పలు మండలాల్లో వరి పంట కోతలు పూర్తి చేసుకుని ధాన్యం రైతులు అమ్మకానికి సిద్ధం చేసుకుంటున్నారని, అయితే కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో ధాన్యాన్ని స్థానిక వ్యాపారులకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఉందని అన్నారు. దళారులు రైతుల నుంచి 100 కిలోలకు గానూ 105 నుంచి 108 కేజీల ధాన్యాన్ని తీసుకుంటున్నారని, ప్రభుత్వ మద్దతు ధర రూ.2300కు గానూ రూ.1750 నుంచి రూ.1800 కొనుగోలు చేస్తున్నారని అన్నారు. దీనివల్ల రైతులు తీవ్రంగా దళారీల బారినపడి మోసపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుత పరిస్థితిని గమనించి ప్రభుత్వం తక్షణమే రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేయాలని కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.కృష్ణమూర్తి, రెడ్డి లక్ష్మునాయుడు, ఉపాధ్యక్షులు బంటు దాసు, వైకుంఠ శంకర్రావు పాల్గొన్నారు.

11 మంది చిరుద్యోగులపై వేటు

ప్రకృతి వ్యవసాయం ఐసిఆర్‌పిల తొలగింపు
అధికారపార్టీకి అనుకూలమైన వారిని నియమించుకున్న వైనం

ప్రజాశక్తి - సాలూరు

నియోజకవర్గంలో ఇష్టారాజ్యంగా చిరుద్యోగుల తొలగింపు పర్వం కొనసాగుతోంది. గడచిన నాలుగు నెలల్లో పిచ్చుకలపై బ్రహ్మాస్త్రాన్ని అధికారపార్టీ నాయకులు ప్రయోగిస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. అధికారం అండచూసుకొని అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులను ఎలాంటి కారణం లేకుండా తొలగించడం వివాదాస్పదమవుతోంది. కొద్ది నెలల క్రితం పాచి పెంట, మక్కువ కెజిబివిల్లో అవుట్ సోర్సింగ్, డైలీ వేజ్ ఉద్యోగులపై వేటు వేశారు. గత ప్రభుత్వం హయాంలో వీరి నియామకం జరిగిందనే ఒకే ఒక్క కారణంతో తొలగించారు. తాజాగా ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్టులో పనిచేస్తున్న చిరుద్యోగులను కూడా ఎలాంటి కారణం లేకుండా తొలగించడం చర్చనీయాంశమైంది. సాలూరు మండలంలో ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్టులో మూడేళ్ళ గా పని చేస్తున్న 11మంది ఐసిఆర్‌పిలను తొలగించారు. వీరంతా నిరుపేద కుటుంబాలకు చెందిన వారే. సకాలంలో జీతాలందక పోయినా సొంత ఖర్చులతో గ్రామాల్లో తిరుగుతూ ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్నారు. విధి నిర్వహణకు సంబంధించి వీరు ఎలాంటి తప్పులు కూడా చేయలేదు. సిరిపురపు సత్యనారాయణ, పొట్లూరి కుమారి, డొంక మాధవి, కొండతామర సూరమ్మ, కోన సౌజన్య, సీదరపు ఆదిలక్ష్మి, బి.లక్ష్మణరావు, సీదరపు కష్ణ, వి.హెచ్.రంగారావు, పి.శ్రీనులు ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్టులో ఐసిఆర్‌పిలుగా పని చేస్తున్నారు. వీరికి సుమారు 12నెలలుగా జీతాల బకాయి కూడా ఉంది. మండలంలోని కొత్తవలస, కరాసువలస, అన్నంరాజువలస, మామిడిపల్లి, మరిపిల్లిలో వీరు పని చేస్తున్నారు. వీరికి నెలకు రూ.10,500 జీతంగా చెల్లిస్తున్నారు. ఆరునెలలకో, ఏడాదికో ఒకసారి జీతాలు మంజూరయ్యే పరిస్థితి ఉన్నా వారు వదలకుండా పని చేస్తున్నారు. వీరిని తొలగించిన వెంటనే టిడిపికి చెందిన కొంతమంది వ్యక్తులను ఐసిఆర్‌పిలుగా నియమించుకున్నారు. తాము చేసిన తప్పు ఏమిటో చెప్పకుండా తొలగించడంపై వారు తీవ్ర మనస్థాపానికి గురవుతున్నారు. తొలగించిన 11మందిలో ఇద్దరు మహిళా వితంతువులు కూడా వున్నారు. మండలానికి చెందిన ముఖ్య నాయకుడి సిఫార్సు మేరకు వీరిని తొలగించి వెంటనే వారి స్థానంలో కొత్త వారిని నియమించుకున్నారు. తొలగింపులపై ఐసిఆర్పీలు సోమవారం డిపిఎం షణ్ముఖరాజును కలిసి వినతిపత్రం అందజేశారు. అకారణంగా తమను తొలగించారని, న్యాయం చేయాలని కోరారు. అయితే డిపిఎం షణ్ముఖ రాజు ఐసిఆర్‌పిలకు ఎలాంటి భరోసా ఇవ్వకపోవడంతో వారు తీవ్ర నిరాశకు గురయ్యారు.

దీనిపై డిపిఎంను వివరణ కోరగా కొత్తగా ఐసిఆర్‌పిలను నియమించినట్లు తనకు ఎలాంటి సమాచారం లేదని చెప్పారు.

ఎన్నికల నియమావళి పక్కాగా అమలు

పార్వతీపురం : స్థానిక సంస్థల శాసనమండలి సభ్యుల ఎన్నిక నేపథ్యంలో జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పక్కాగా అమలుచేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తహశీల్దార్లను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి ఎన్నికలపై ఎస్‌పి ఎస్‌వి మాధవరెడ్డితో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందున రాజకీయ నాయకుల విగ్రహాలు, ఫ్లెక్సీ బ్యానర్లు, చిత్రపటాలను తొలగించాల్సి ఉందన్నారు. రాజకీయ నాయకుల విగ్రహాలకు తక్షణమే ముసుగువేయాలని, ఫ్లెక్సీలను తొలగించాలని, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లోని చిత్రపటాలను తీసివేయాలని ఆదేశించారు. సాధారణ ఎన్నికల మాదిరిగానే ఈ ఎన్నికలకు ప్రవర్తనా నియమావళి వర్తిస్తుందని స్పష్టం చేశారు. ముఖ్యంగా సచివాలయ సిబ్బందికి ఈ విషయాన్ని తెలియజేయాలన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంతో పాటు జిల్లా కేంద్రంగా ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశామని, ప్రతి మండలానికి ఎంసిసి బృందం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గతంలో ఎన్నికలు నిర్వహించినప్పటికీ అందరూ అప్రమత్తంగా ఉండాలని, జిల్లా నుంచి ఎటువంటి ప్రతికూల వార్తలు రాకుండా చూడాలని తెలిపారు. జిల్లాలో ఎన్నికలు సజావుగా జరిగేలా కృషిచేయాలని పిలుపు నిచ్చారు. సమావేశంలో మండల తహశీల్దార్లు, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దశమంతపురంలో డయేరియా

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని దశమంతపురం బిసి కాలనీలో డయేరియా ప్రబలి డి.అప్పలస్వామి అస్వస్థకు గురయ్యాడు. వాంతులు విరోచనాలతో బాధపడు తుండటంతో వీరఘట్టం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చికిత్స కోసం తరలిం చారు. ప్రస్తుత ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యాధికారి పి ఉమామహేశ్వరి తెలిపారు.

పాదయాత్ర వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బడిదేవర కొండ పరిరక్షణ కమిటీ నాయకులు

బడిదేవరమ్మను కాపాడుకుందాం

6 నుంచి 9 వరకు పాదయాత్రకు కదలిరండి
బడిదేవరకొండ పరిరక్షణ కమిటీ పిలుపు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

బడిదేవరకొండ తవ్వకాలను ఆపాలని కొండ ప్రజల అందరికీ అండగా నిలుస్తుందని, మనల్ని కాపాడే అమృతమూర్తిని తవ్వే హక్కు ఏ ఒక్కరికీ లేదని బడిదేవరకొండ పరిరక్షణ కమిటీ సభ్యులు అన్నారు. సోమవారం స్థానిక సుందరయ్య భవనంలో బడిదేవరకొండ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో పాదయాత్రకు సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ కొండ తవ్వకాలకు మన ప్రాంతంతో సంబంధంలేని కొంతమంది పెత్తందారులు, భూస్వాములు క్వారీ యజమానికి అనుమతులు ఇవ్వడంతో ఎటువంటి ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా కొండను తవ్వుకుపోవడం అన్యాయమని, దీన్ని వెంటనే ఆపాలని అన్నారు. కొండ పార్వతీపురం మండలానికి జీవనాధారంగా నిలుస్తుందని, అది కొండ మాత్రమే కాదని వర్షించి మనకు సాగునీరిచ్చే అమ్మని, మనల్ని కాపాడే అమృతమూర్తిని కాపాడుకునే బాధ్యత స్థానిక ప్రజలు, గిరిజనులందరిదని అన్నారు.కొండ తవ్వకాలు అక్రమమనిఇప్పటికే పలుమార్లు ఇటు అధికారులకు అటు ప్రజా ప్రతినిధులకు విన్నవించుకుంటున్నా పట్టించుకోకపోవడం దుర్మార్గమని మండిపడ్డారు. గతంలో అనుమతులను రద్దు చేసిన ప్రభుత్వాలే నేడు అనుమతులు ఇవ్వడం విడ్డూరమని, ఇచ్చిన లీజు లైసెన్సులు రద్దు చేయకుంటే పాదయాత్ర అనంతరం పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. బుధవారం ఉదయం 11 గంటలకు పాత బస్టాండ్ నుంచి పాదయాత్ర ప్రారంభమై వెంకంపేట, చిన్నబొండపల్లి, ఎమ్మార్ నగరం, సంగంవలస, నడిమివలస, మడకావానివలస, గంగాపురం, కోరి, హిందూపురం, సూడిగం, పెదగొండపల్లి, దిబ్బగుడ్డివలస, పుట్టూరు, లచ్చిరాజుపేట, తాళ్లబురిడీ, చలమవలస, డి.ములగ, ఎన్.ములగ, కవిటిబద్ర, కె.ములగ గ్రామాల్లో పర్యటించి సభలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ పాదయాత్రకు మండల ప్రజలంతా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి, రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పి.శ్రీనునాయుడు, అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బి.నర్సింగరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి కె.మన్మదరావు, గిరిజన సంక్షేమ సంఘం కన్వీనర్ పి.రంజిత్ కుమార్, ఎఐటియుసి నాయకులు ఆర్వీఎస్ కుమార్, చెరువుల సంరక్షణ కమిటీ నాయకులు వంగల దాలినాయుడు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బంటు దాసు, రైతు కూలీ సంఘం జిల్లా కమిటీ సభ్యులు ఎస్.విశ్వేశ్వరరావు, అఖిల భారత గ్రామీణ ఉపాధి కార్మిక సంఘం నాయకులు పి.సంగం పాల్గొన్నారు.

జిల్లాలో 49 ఆధార్ కేంద్రాలు

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో 49 ఆధార్ కేంద్రాలు నిర్వహించనున్నట్టు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ కేంద్రాల్లో ఆధార్ అప్డేషన్, పేర్లు, చిరునామా, పుట్టిన తేదీలు తదితర మార్పులు చేసుకోవచ్చని అన్నారు. పుట్టిన తేదీ మార్పుకు నిర్దిష్ట ధ్రువ పత్రం సమర్పించాలని స్పష్టం చేశారు. ఇతర అంశాలకు గెజిటెడ్, ధ్రువీకరణ అధీకృత అధికారం గల అధికారి నుంచి తీసుకుని సమర్పించవచ్చునని ఆయన అన్నారు.

ఆధార్ కేంద్రాల వివరాలు

బలిజిపేట మండలంలో అరసాడ, బలిజిపేట సచివాలయాల్లోనూ, భామిని మండలంలో బత్తిలి-2, ఘనసర, గరుగుబిల్లి మండలంలో గరుగుబిల్లి, రావివలస, ఉల్లిభద్ర గుమ్మలక్ష్మీపురం మండలం బాలేసు, గుమ్మలక్ష్మీపురం, కొండవాడ, ఇరిడి, జయ్యమ్మవలస మండలంలో అలమండ, బిజె పురం, గవరంపేట, కొమరాడ మండలంలో గంగరేగులవలస, మాదిలింగి, పెదశాఖ, కురుపాం మండలంలో గుమ్మ, మొండెంఖల్లు, పెద్ద గొత్తిలి, రస్తా కుంటుబాయి, మక్కువ మండలంలో డి.శ్రీలం, మక్కువ 1, 2, శంబర, పాచిపెంట మండలంలో పనుకువలస, పాలకొండ మండలంలో నీలమ్మ కాలనీ, ఎం.సింగిపురం పార్వతీపురం మండలంలో జగన్నాధపురం -01, కొత్త బెలగాం -01, డోకిశీల, పెద్దమరికి సాలూరు మండలంలో కూరుకుట్టి, పెద్దపదం, రామా కాలనీ, సీతంపేట మండలంలో దారపాడు, దోనుబై, గోయిడి, కిల్లాడ, సీతంపేట ఎ, సోమగండి, సీతానగరం మండలంలో అంటిపేట, వీరఘట్టం మండలంలో కత్తులు కవిటి, పనసనందివాడ, వండవ, వీరఘట్టం 1,3 సచివాలయాల వద్ద ఆధార్ కేంద్రాలు నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఈ సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా రమేష్, భాస్కరరావు

ప్రజాశక్తి - పార్వతీపురం

యుటిఎఫ్ స్వర్ణోత్సవాల సందర్భంగా నిర్వహించిన జిల్లా మహా సభలో జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా తోట రమేష్, కొర్రా భాస్కరరావు ఎన్నికయ్యారు. స్థానిక ఎన్‌జిఒ హోంలో నిర్వహించిన ప్రతినిధుల సభలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ జిఒ 117ను రద్దు చేయాలని, ఆర్థిక బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులపై యాప్‌ల భారం తగ్గించాలని కోరారు. రాష్ట కార్యదర్శులు ఎస్.కిశోర్ కుమార్, ఆర్.మోహనరావు మాట్లాడుతూ టిడిపి కూటమి ప్రభుత్వం సమస్యలు పరిష్కారానికి మరికొంత సమయం కావాలని కోరుతుందని చెప్పారు. జిల్లా అధ్యక్ష ప్రధానకార్యదర్శులతో పాటు సహాధ్యక్షులుగా బి.విజయకుమార్, వి.జ్యోతి, గౌరవాధ్యక్షులుగా ఎ.భాస్కరరావు, కోశాధికారిగా కె.మురళి ఎన్నికైనట్లు రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహన్ రావు తెలిపారు.

కొత్తగాఎన్నికైన యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రమేష్, భాస్కరరావు

జాతీయ క్రీడల్లో పతకాలు సాధించాలి : పిఒ

ప్రజాశక్తి - పార్వతీపురం

స్థానిక ఐటిడిఎ పరిధిలోని క్రీడాకారులకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని, జాతీయ స్థాయిలో పతకాలు సాధించాలని ఐటిడిఎ పిఒ అసుతోశ్ శ్రీవాస్తవ తెలిపారు. జాతీయ స్థాయి క్రీడలకు ఎంపికైన గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులను సోమవారం తన ఛాంబరులో అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుమలక్ష్మీపురం మండలం కొత్తగూడ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థి అరిక అభిచందు జమ్మూ కాశ్మీర్‌లో జరిగే ఫెన్సింగ్ పోటీలకు, అదే పాఠశాలలో చదువుతున్న అరిక చరణ్ చత్తీస్‌ఘడ్‌లో జరిగే జాతీయ హేండ్ బాల్ పోటీలకు ఎంపికకావడం పట్ల పిఒ హర్షం వ్యక్తం చేశారు. గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో పతకాలు సాధించాలని, ఇందుకు అవసరమైన సహకారాన్ని అందిస్తామని అన్నారు. జాతీయ స్థాయికి వెళ్లే ఈ క్రీడాకారులకు అవసరమైన సామాగ్రిని ఐటిడిఎ నుంచి సమకూరుస్తామని పిఒ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పీడీలు నిమ్మల మాధవరావు, భోగేష్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర సదస్సు కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు

10న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల రాష్ట్ర సదస్సు

ప్రజాశక్తి - సాలూరురూరల్

మున్సిపాల్టీల్లోనూ, కార్పొరేషన్లలో పనిచేస్తున్న ఇంజినీరింగ్ విభాగాల కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈనెల 10న విజయవాడలో రాష్ట్రస్థాయి సదస్సు జరుగుతుందని, ఈ సదస్సుకు పట్టణాల్లో గల ఇంజినీరింగ్ కార్మికులంతా పాల్గొని జయప్రదం చేయాలని ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎన్ వై నాయుడు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం సాలూరులో ఇంజినీరింగ్ విభాగాల నాయకులతో కలిసి సదస్సు కరపత్రం విడుదల చేశారు. అనంతరం మాట్లాడారు. రాష్ట్రంలో ఇంజినీరింగ్ కార్మికులకు రిస్క్ అలవెన్స్ లేకపోవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకునే పరిస్థితి లేదని, పారిశుధ్య కార్మికులతో సమానంగా రూ.21వేలు వేతనం ఇవ్వాలని, జిఒ 7 అమలు చేసి, వేతనాలు పెంచాలని, గత ప్రభుత్వం మున్సిపల్ అధికారులు జరిపిన మినిట్స్ ఆధారంగా స్కిల్డ్ వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన జీతం ఇవ్వాలని, మృతి చెందిన వారికి దహన సంస్కార ఖర్చులకు రూ.20వేలు పెంచుతూ చేసిన నిర్ణయాన్ని జీవో ఇవ్వాలని, గత సమ్మె కాలంలో చేసిన అన్ని రకాల ఒప్పందాలకు జీవోలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సదస్సును జయప్రదం చేసేందుకు కార్మికులంతా హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలోవాటర్ వర్కర్స్, ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు బాబురావు, ఉమాశంకర్, అమర కుమార్, దుర్గ, పంచముఖి తదితరులు పాల్గొన్నారు.

వీడియో డబ్బులు చెల్లించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

2024 లో జరిగిన సాధారణ ఎన్నికల సమయంలో వీడియో గ్రాఫర్లకు ఇవ్వాల్సిన డబ్బులు తక్షణమే చెల్లించాలని సోమవారం కలెక్టరేట్ ఎఒకు వీడియో గ్రాఫర్లు సిబిటియు జిల్లా కార్యదర్శి గొర్లి వెంకటరమణతో కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2024 గాను ఎన్నికల కోసం కెమెరాలు పెట్టి ఉన్నామని, అప్పటి తహశీల్దార్ వరహాలు వీడియో గ్రాఫర్లకు అడ్వాన్స్‌గా కొంత డబ్బులు ఇచ్చి ఉన్నారని, ఎలక్షన్ ఫండ్ వస్తే మిగిలిన డబ్బులు చెల్లిస్తామన్నారని తెలిపారు. ఎన్నికల ఫండ్ వచ్చినా తమకు డబ్బులు ఇవ్వకుండా దాటవేసే ధోరణి వహిస్తున్నారని తెలిపారు. తమకు చెల్లించాల్సిన డబ్బులు చెల్లించమని పాలకొండ ఆర్‌డిఒకు, ఐటిడిఎ పిఒకు, కలెక్టర్‌కు పలుమార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమతో పాటు టెంట్ హౌస్ డబ్బులు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో దాలాల రమణారావు, కొనసల అన్నాజీ రావు, సిరిపు శ్రీనివాస్ పాల్గొన్నారు.

పార్టీ సూచించిన అభ్యర్థిని గెలిపించుకుందాం

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

పార్టీ సూచించిన అభ్యర్థిని ఎమ్మెల్సీగా గెలిపించుకుందామని మాజీ ఎమ్మెల్యే జోగారావు అన్నారు. సోమవారం జోగారావు తన క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ వైసిపి ప్రజా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా నాయకులు ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ జిల్లా పార్టీ అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్ రాజు సూచన మేరకు అధిష్ఠానం జిల్లాలో ఎవరిని అభ్యర్థిగా నిర్ణయించినప్పటికీ ప్రజాప్రతినిధులందరూ ఏకతాటిపై నిలిచి పార్టీ సూచించిన అభ్యర్థిని గెలిపించుకోవాలని సూచించారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి - సాలూరు రూరల్

ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వం నుంచి రావాల్సిన ఐఆర్, ఎపిజిఎల్‌ఐ, పిఆర్‌సిలను వెంటనే విడుదల చేయాలని ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని గత ప్రభుత్వంలో విద్యావ్యవస్థను నాశనం చేయడానికి తీసుకొచ్చిన 117 జీవోను వెంటనే రద్దు చేయాలని యుటిఎఫ్ జిల్లా సహ అధ్యక్షుడు బోడేల విజయకుమార్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం నుంచి ఉపాధ్యాయులకు బకాయిలు చాలా వరకు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని వెంటనే విడుదల చేయాలని కోరారు.

సైబర్ క్రైమ్‌పై అప్రమత్తం

ప్రజాశక్తి - కురుపాం

సైబర్ క్రైమ్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఎస్ఐ పి. నారాయణరావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు సైబర్ క్రైమ్, రోడ్ యాక్సిడెంట్లు, మత్తు పదార్థాలు బానిసవ్వడం వల్ల ఎలాంటి అనర్థాలు కలుగుతున్నాయో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో ప్రతి ఒక్కరికి స్మార్ట్ ఫోన్ వాడకంలో భాగమైందన్నారు. ఆన్‌లైన్ మోసాలకు బలి కావద్దని, యువత డ్రగ్స్‌కు బానిస కాకుండా మంచి చదువులు చదివి ఉన్నత స్థాయిలో స్థిరపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్, సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరి

వాహనదారులు వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా రహదారి భద్రతా నియమాలు పాటించాలని స్థానిక ఎస్సై నారాయణరావు అన్నారు. సోమవారం మండలంలో మూలిగూడ జంక్షన్ వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. అనంతరం వాహనదారులకు వాహనాలు నడిపేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. తప్పనిసరిగా హెల్మెట్ ధరించి అన్ని ధ్రువీకరణ పత్రాలు ఉండాలని, మద్యం సేవించి వాహనాల నడపకూడదని సూచించారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేకుండా వాహనాలు నడిపిన వారికి అపరాధ రుసుము వేశారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మలుపుల వద్ద బోర్డులు ఏర్పాటు

కురుపాం: మండలంలో నీలకంఠాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో గల నీలకంఠాపురం నుంచి పి.లేవిడి జంక్షన్ వరకు ఉన్న మలుపులు వద్ద ప్రమాద సూచిక బోర్డులను సోమవారం సాయంత్రం ఎల్విన పేట సర్కిల్ సిఐ హరి, ఎస్ఐ నీలకంఠరావు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సిఐ హరి మాట్లాడుతూ మలుపులు వద్ద ప్రమాదాలు జరక్కుండా సూచికగా బోర్డులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. వాహనదారులు ఇది గమనించి వాహనాలు నడిపేటప్పుడు మలుపులు వద్ద తగు జాగ్రత్తలు తీసుకోని నడపాలని చెప్పారు.

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్న పోలీసులు

వైటిసిలో స్కిల్ సెన్సస్‌పై శిక్షణ

సీతంపేట: సీతంపేట వైటిసిలో సోమవారం కార్యదర్శులకు సచివాలయ సిబ్బందికి స్కిల్ సెన్సస్‌పై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎల్‌డిఒ వివి గోపాలకృష్ణ మాట్లాడుతూ ఇలాంటి శిక్షణలు వినియోగించుకోవాలని కోరారు. సచివాలయ సిబ్బంది నైపుణ్య గణన శిక్షణలో సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి దానిపై స్కిల్ ఉద్యోగికి ఉండాలన్నారు. విధులు బాధ్యతలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ గీతాంజలి, ఇఒపిఆర్‌డి సత్యం, కార్యదర్శులు, సచివాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై గిరిజనుల వినతి

ప్రజాశక్తి - సీతంపేట

సీతంపేట ఐటిడిఎలో గ్రీవెన్స్‌ను సోమవారం పిహెచ్‌ఒ గణేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గిరిజనులు తమ సమస్యలను విన్నవించారు. జన్నోడుగూడ గ్రామానికి చెందిన మోహన్‌రావు కమ్యూనిటీ హాల్ మంజూరు చేయాలని కోరారు. వజ్రాయిగూడకు చెందిన మోకలింగం గుడి మంజూరు చేయాలని, కాకర గూడకు చెందిన అప్పన్న ఆర్‌ఒఎఫ్‌ఆర్ పట్టా మంజూరు చేయాలని కోరారు. చిన్న కోటిపల్లికు చెందిన రవి ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్ట మంజూరు చేయాలని, దిమ్ముడు జోలకు చెందిన మిన్నారావు వ్యవసాయ బోరు మంజూరు చేయాలని కోరారు. ఈ గ్రీవెన్స్‌లో డి ఇ సింహాచలం, డిప్యూటీ ఇఒ నారాయుడు, సిడిపిఒ రంగలక్ష్మి, స్పోర్ట్స్ ఇంచార్జ్ జాకబ్ దయానంద్, ఎఎంఒ కోటిబాబు, జిసిటిఒ రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు ఇరువైపులా తుప్పల తొలగింపు

ప్రజాశక్తి - సీతానగరం

రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా ఎస్సై ఎం.రాజేష్ ఆధ్వర్యంలో అప్పయ్యపేటలో జాతీయ రహదారిపై రోడ్డు పక్కన మలుపు వద్ద ప్రమాదకరంగా మారిన తుప్పలను తొలగించారు. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించేలా చెట్లను, తుప్పలను తొలగించారు. చినబోగిలి వద్ద జాతీయ రహదారిపై వాహనాలు తనిఖీ చేసి హెల్మెట్ ధరించని వారికి, ఇతర వాహన చోదకులకు హెల్మెట్ ఉపయోగం, సైబర్ నేరాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం కల్పించారు. అనంతరం స్టేషన్ మహిళా హెచ్‌సి సుజాతతో కలిసి సీతానగరం జెడ్‌పిహెచ్ స్కూల్‌ను సందర్శించి విద్యార్థులకు ఫోక్సో యాక్ట్ కోసం గుడ్ టచ్, బ్యాడ్ టచ్ కోసం మాదకద్రవ్యాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రోడ్డు భద్రత నియమాల కోసం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బందితో పాటు పాఠశాల ఉపాధ్యాయులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇదేనా అభివృద్ధి?

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలో పూతక వలస పంచాయతీ గూడంగి అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందని గిరిజన సంఘం నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. సందర్భంగా ఐటిడిఎ అధికారులకు పర్యాటక రంగంపై మక్కువ ఎందుకు? గిరిజన అభివృద్ధిపై నిర్లక్ష్యం ఎందుకు అని ఆదివాసి గిరిజన సంఘం మండల అధ్యక్షులు జె. శ్రీరాములు, కార్యదర్శి బి. సాయికుమార్ అన్నారు. రహదారులు, తాగునీరు, స్కూల్ భవనాలు, పక్క గృహాలు వంటి మౌలిక సమస్యలపై దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు.

జాతీయస్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి- సీతంపేట

స్థానిక గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఎస్.సమిత ఇటీవల జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌రాష్ట్ర పోటీల్లో ట్రిపుల్ జంప్ విభాగంలో జాతీయ స్థాయికి ఎంపికైంది. దీంతో ఆమెను ఐటిడిఎ పిఒ యశ్వంత్ కుమార్ రెడ్డి, డిడి అన్నదొర, డిప్యూటీ ఇఒ నారాయుడు ప్రధానోపాధ్యాయులు వసంత లక్ష్మి, వసతి గృహ అధికారి పి.అమల, పిడి శైలజ ప్రమీల అభినందించారు.

డిగ్రీలో హానర్స్ విధానాన్ని రద్దు చేయాలి

- ముగిసిన ఎస్ఎఫ్ఐ దీక్షలు
- రైతుసంఘం, సిఐటియు మద్దతు

ప్రజాశక్తి - పార్వతీపురం

గత రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా తీసుకొచ్చిన డిగ్రీ హానర్స్ విధానం విద్యార్థుల పాలిట శాపంగా మారిందని, విద్యార్థికి కోన్సు ఎంపిక చేసుకొనే హక్కును కాలరాయడమేనని వెంటనే ఈ విధానాన్ని రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ చేపడుతున్న రిలే దీక్షలు మూడో రోజుతో ముగిసింది. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కష్ణమూర్తి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.ఇందిర విద్యార్థులు చేపడుతున్న దీక్షా శిబిరానికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఎం.కృష్ణమూర్తి మాట్లాడుతూ మాట్లాడుతూ విద్యా వ్యవస్థను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రాజకీయ నూతన విధానాలతో ప్రభుత్వ విద్యను పూర్తిగా నిర్వీర్యం చేపడుతుందని, దీన్ని విద్యార్థులంతా ముక్తకంఠంతో ఖండించాలని కోరారు. చైనా క్యూబా ప్రపంచ దేశాలు విద్యార్థులను మేధావి వర్గ నాయకులుగా తీర్చిదిద్దుతుంటే మన దేశంలో మాత్రం

విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ఎం. కృష్ణమూర్తి

జ్యోతిష్యం, కర్మకాండం, భూతవైద్య శాస్త్రాలతో పాఠ్యాంశాలలో జోడించి విద్యార్థులను మతాలకు బానిసలుగా తీర్చిదిద్దే పనిలో ఉందని ఇది బిజెపి, ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలని అన్నారు. వంద రోజుల్లో చేయగలిగిందేమీ లేక లడ్డుపై రాజకీయం చేశామని చెప్పడం సిగ్గుమాలిన చర్యని, గత ప్రభుత్వం చేయలేని విద్యా వ్యవస్థ మార్పుని ఈనాటి కూటమి ప్రభుత్వమైనా చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె.రాజు, డి.పండు మాట్లాడుతూ డిగ్రీలో హానర్స్ పరీక్ష విధానమంతా గందరగోళమైందని, చివరికి విద్యార్థికి ఏ సెమిస్టర్‌కు ఏ పరీక్ష ఉంటుందో కూడా అర్థం కాని పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. దీంతో డిగ్రీలో చేరేందుకు ఆసక్తి చూపకపోవడంలో ఇది కూడా ఒక కారణమని వాపోయారు. చివరికి చేరిన వారు కూడా మధ్యలోనే డ్రాప్ అవుతున్నారన్నారు. జిఒ 77 అమలుతో ప్రైవేట్, ఎయిడెడ్ విద్యా సంస్థల్లో పిజి చదువుతున్న విద్యార్థులకు ఫీజు రీయంబర్స్‌మెంట్ నిలిపివేసిందని, ఉన్నత చదువులు చదవాలనుకునే విద్యార్థులు ఫీజులు కట్టి చదవలేక చదువుకు దూరవుతున్నారని అన్నారు. లక్ష సంఖ్యలో విద్యార్థులు నష్టపోయారని, ఉన్నత విద్య చదివే వారి శాతాన్ని 50శాతం పెంచాలనే లక్ష్యం నెరవేరాలంటే ఈ జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపిడిఒ

ఆధార్ కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని ఎల్విన్‌పేట సచివాలయంలో సోమవారం ఆధార్ కేంద్రాన్ని ప్రారంభించారు. విద్యార్థులు, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించిన అధికారులు వారి సౌకర్యార్థం ఆధార్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటుతో సోమవారం పెద్ద సంఖ్యలో విద్యార్థులు అపార్ కార్డు కోసం ఆధార్‌లో చిరునామా, పేరు వంటివి సరిచేసుకునేందుకు వచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రామసామంతుల చైతన్య స్రవంతి, ఎంపిడిఒ సాల్మన్ రాజు, సచివాలయం సిబ్బంది ఉన్నారు.

పిజిఆర్ఎస్ అర్జీలను పెండింగ్ ఉంచొద్దు : కలెక్టర్

ప్రజాశక్తి -పార్వతీపురం

ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)లో వచ్చిన అర్జీలపై జిల్లా అధికారులు తక్షణమే స్పందించాలని, అర్జీలు పెండింగ్ ఉండరాదని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ పేర్కొన్నారు. ఇందుకు ఆయా శాఖల్లో ఒక నోడల్ అధికారిని నియమించి, పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారం పట్ల శిక్షణ ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం చూపి జిల్లాకు చెడ్డ పేరు వచ్చేలా అధికారులు నడుచుకుంటే తీవ్రమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో పిజిఆర్ఎస్‌పై అన్ని శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో తక్కువగా అర్జీలు అందుతున్నప్పటికీ కొందరు అధికారుల నిర్లక్ష్యం వలన జిల్లాకు చెడ్డ పేరు వచ్చే అవకాశం ఉందని అన్నారు. వచ్చిన అర్జీలను ఎప్పటి కపుడు పరిశీలించి, సకాలంలో నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. అర్జీ రీ ఓపెన్ అయ్యే పరిస్థితి ఉండరాదని కలెక్టర్ తేల్చిచెప్పారు. శిక్షణ పూర్తిచేసుకున్నప్పటికీ అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపని శాఖాధిపతులపై చర్యలు తప్పవని హెచ్చరికలు జారీచేశారు.

మండల ప్రత్యేకాధికారులు పల్లె నిద్ర చేయాలి

జిల్లాలోని మండల ప్రత్యేక అధికారులు గురువారం వసతి గృహాలను సందర్శించి, అక్కడ స్థితిగతులను తెలుసుకోవాలని, రాత్రికి అక్కడే బస చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రత్యేక అధికారులకు అప్పగించిన మండలాల్లోని వసతి గృహాలను గురువారం సందర్శించి, అక్కడ విద్యార్థులతో కలిసి భోజనం చేయాలన్నారు. ఆ రోజు రాత్రి అదే వసతి గృహంలో నిద్ర చేసి స్థితిగతులను తెలుసు కోవాలని ఆదేశించారు. వసతి గృహాల సందర్శనలో విద్యార్థులకు అందుతున్న విద్యా ప్రమాణాలు, నాణ్యమైన పోషక ఆహారంతో పాటు కిచెన్ గార్డెన్ తదితర అంశాలను పరిగణలోకి తీసుకోవాలని తెలిపారు. వసతి గృహాలకు వెళ్లినపుడు చెక్ లిస్ట్ ప్రకారం అన్ని అమలవుతున్నదీ, లేనిదీ పరిశీలించాలన్నారు. తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ వంటి మౌలిక వసతులతో పాటు పారిశుధ్యం పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. గురువారం రాత్రి బస అనంతరం శుక్రవారం రోజున అదే గ్రామాన్ని సందర్శించాలని ఆదేశించారు. ఆ గ్రామంలో బహిరంగ మలవిసర్జన పట్ల ప్రజల్లో అవగాహన కల్పించాలని,

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

మరుగుదొడ్లు నిర్మించుకునేందుకు కేంద్ర ప్రభుత్వం రూ.15వేలు మంజూరు చేస్తున్న సంగతిని ప్రజలకు వివరించాలని తెలిపారు. గ్రామంలో సమస్యలుంటే సంబంధిత అధికారుల ద్వారా పరిష్కరించాలని సూచించారు. రక్తహీనత లోపం ఉన్న గర్భిణీలు, పిల్లలను గుర్తించి, వారి తల్లిదండ్రులకు ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారం గురించి వివరిస్తూ, వాటిని ఉపయోగించుకునేలా చూడాలని చెప్పారు. ఆ గ్రామంలో ఉన్న అంగన్వాడీ కేంద్రాన్ని, పాఠశాలను కూడా సందర్శించాలని, అక్కడ పారిశుధ్యం, న్యూట్రీ గార్డెన్, బాల విహార్, మై స్కూల్ - మై ప్రైడ్ వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని తెలిపారు. చెత్త నుండి సంపద గురించి గ్రామస్తులకు వివరించి వాటిని ఏర్పాటు చేసుకునేలా చర్యలు చేపట్టాలని అన్నారు.. ఇందులో గ్రామ సచివాలయ సిబ్బందిని వినియోగించుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి అశుతోశ్ శ్రీవాస్తవ, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సంకల్ప్ అవార్డుకు నామినేషన్లు స్వీకరణ

జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాలు, వాటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచిన ఉత్తమ కార్యాలయానికి స్వచ్ఛ సంకల్ప్ అవార్డును ప్రకటిస్తూ, ఆ అధికారిని సత్కరించనున్నట్టు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ప్రకటించారు. ఈ అవార్డులను ప్రతి నెలా ప్రకటిస్తామని, ఉత్తమ కార్యాలయానికి సంబంధించిన నామినేషన్లను ప్రతి నెలా 25లోగా తమకు సమర్పించాలని తెలిపారు. కార్యాలయాలకు వైట్ వాష్ చేయడం, కార్యాలయం పేరు గల బోర్డు, నోటీసు బోర్డు, ఫిర్యాదుల బాక్సును ఏర్పాటు చేయాలని అన్నారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయాన్ని అందంగా తీర్చిదిద్దాలని చెప్పారు. అందంగా, పరిశుభ్రంగా తీర్చిదిద్దిన కార్యాలయాల వీడియోలు, ఫొటోలను పరిశీలించి ఉత్తమంగా నిలిచిన కార్యాలయానికి స్వచ్ఛ సంకల్ప్ అవార్డును ప్రకటిస్తామని కలెక్టర్ తెలిపారు. అవార్డు పొందిన అధికారికి నెల మొదటి సోమవారం రోజున సత్కార కార్యక్రమాన్ని చేపడతామని కలెక్టర్ స్పష్టం చేశారు.

వివిధ దినపత్రికల్లో ప్రచురితమైన ప్రతికూల వార్తలపై జిల్లా అధికారులు తక్షణమే స్పందించాలని, వాటికి శాస్వత పరిష్కారాన్ని తెలియజేయాలని సూచించారు. ముఖ్యంగా రహదారులు, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం వంటి అంశాలపై ఆయా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. ఇందులో నిర్లక్ష్యం వహిస్తే, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆధార్‌తో అనుసంధానమైన కొన్ని అంశాలపై ప్రధానంగా సమస్యలు తలెత్తు తున్నాయని, అటువంటి సమస్యలను తొలగించేందుకు జిల్లాలో ఆధార్ నమోదు కేంద్రాలు పనిచేస్తున్నాయన్నారు. వీటిపై గ్రామ, మండల స్థాయిలోని ప్రజలకు తెలిసేలా ప్రత్యేక అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. అంగన్వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్లు, రంగులు వేయడం వంటి పనులను పరిశీలించి చర్యలు చేపట్టాలని, ఉపాధ్యాయ ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని కూడా వేగవంతం చేయాలని కలెక్టర్ వివరించారు. కాగిత రహిత పాలనను అందించే దిశగా, ఇకపై ప్రతి శాఖాధికారి తమ శాఖకు సంబంధించిన ఫైళ్లను ఇ-ఆఫీస్ ద్వారా సమర్పించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని విఆర్ఎల ధర్నా

ప్రజాశక్తి- పార్వతీపురం

సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గ్రామ రెవెన్యూ సహాయకులు సోమవారం స్థానిక కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా విఆర్ఎ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు యమ్మల మన్మధరావు మాట్లాడుతూ 8ఏళ్లుగా విఆర్ఎలకు వేతనాలు పెరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పనిచేస్తున్న విఆర్ఎలను నామినీలుగా గుర్తించాలన్నారు. అర్హులైన వారందరినీ వాచ్మెన్, అటెండర్, కంప్యూటర్ ఆపరేటర్లు, డ్రైవర్లు, విఆర్ఒలుగా పదోన్నతి ఇవ్వాలని కోరారు. అర్హులైన వారందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఎన్నికల కాలంలో అన్ని రకాల పనులు చేయడంలో విఆర్ఎలు కీలకమైన పాత్ర పోషించారని తెలిపారు. గ్రామ సేవకులు ఎదుర్కొంటున్న సమస్యలు తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పై ఈనెల 18న చలో విజయవాడ సిసిఎల్ఎ కార్యాలయం వద్ద జరుగు కార్యక్రమానికి

నిరసన తెలుపుతున్న విఆర్ఎలు

తరలివెళ్లాలని కోరారు. అనంతరం కలెక్టరేట్ ఎఒకి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో విఆర్ఎ జిల్లా అధ్యక్షుడు ఈశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కృష్ణ, సిఐటియు జిల్లా అధ్యక్షులు డి.రమణారావు, శ్రామిక మహిళా సంఘం నాయకురాలు వి.ఇందిరా, కోశాధికారి గొర్ల వెంకటరమణ అధిక సంఖ్యలో విఆర్ఎలు తదితరులు పాల్గొన్నారు.

శతశాతం రిజర్వేషన్లు కల్పించాలి

ప్రజాశక్తి- సీతంపేట

షెడ్యూల్ ప్రాంత స్థానిక ఉద్యోగ నియమాకాల్లో 100 శాతం రిజర్వేషన్లు కల్పించాలని సోమవారం ఆదివాసీ జెఎసి ఆధ్వర్యంలో శాంతియుత మన్యం ర్యాలీ నిర్వహించారు. ముందుగా సీతంపేట ఏజెన్సీలో వివిధ మండలాల గ్రామాల నుంచి గిరిజనులు యువత స్థానిక హై స్కూల్‌కు అధిక సంఖ్యలో చేరుకున్నారు. స్థానిక బస్టాండ్ వద్ద మానవహారం నిర్వహించి, అక్కడ నుంచి శాంతియుతంగా ఐటిడిఎ ముఖద్వారం వరకూ ర్యాలీ చేపట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జెఎసి నాయకులు మాట్లాడుతూ జిఒ 3ను పునరుద్ధరిం చాలని డిమాండ్ చేశారు. ఎస్‌టి బ్యాక్ లాగ్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలన్నారు. స్పెషల్ డిఎస్‌సి నిర్వహించాలన్నారు. ఐటిడిఎలో స్థానిక గిరిజన అభ్యర్థులచే ఖాళీలు భర్తీ చేయాలని డిమాండ్

ర్యాలీ చేస్తున్న ఆదివాసీ జెఎసి నాయకులు

చేశారు. ఎన్నికల్లో గిరిజనులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని, గిరిజన చట్టాలు పగడ్బందీగా అమలు చేయాలని కోరారు. అనంతరం ఐటిడిఎ అధికారులకు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో జెఎసి నాయకులు బిడ్డిక శ్రీనివాసరావు, కె.ధర్మారావు, బి.ఉమామహేశ్వర రావు, రామ్మోహన్ రావు, సర్పంచ్ ఆదిలక్ష్మి, గౌరీ శంకర్ రామకృష్ణ, రామారావు తదితరులు పాల్గొన్నారు.

మిశ్రమ దాణా పశువులకు ఎంతో మేలు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

పశువులు తినే ఆహారంలో మిశ్రమ దాణా వాడడం వల్ల పశువులకు ఖనిజ లవణాలతో పాటు విటమిన్లు తగిన మోతాదులో దాణా రూపంలో అందుతాయని జిల్లా పశు సంవర్ధక అధికారి డాక్టర్ శివ్వాల మన్మథరావు అన్నారు. జిల్లాకు 125 మెట్రిక్ టన్నుల సంపూర్ణ మిశ్రమ దాణాను కేటాయించగా, పార్వతీపురం మండలానికి 23టన్నుల మిశ్రమ దాణా వచ్చింది. సోమవారం వెంకంపేటలో సబ్సిడీపై పాడి రైతులకు పంపిణి చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మిశ్రమ దాణాలో మొక్కజొన్న, సజ్జలు, రాగులు, ఉలవలు, శనగలు, చెక్కలు, వరి తవుడు, చెరకు మడ్డి, ఖనిజ లవణాలు, విటమిన్లు, ఉప్పు వంటి స్థూల పోషకాలుంటాయని వివరించారు.

పచ్చిగడ్డి, ఎండుగడ్డి, దాణాలు కలిపి ఒకేసారి మిశ్రమ దాణాగా పశువులకు మేతగా పెడితే పశువుల జీర్ణక్రియ మెరుగ్గా ఉంటుందని తెలిపారు. కావున పాల ఉత్పత్తి శాతం పెరుగుతుం దన్నారు. తద్వారా పాడి రైతులకు అధిక ఆదాయంతో పాటు శ్రమ తగ్గుతుందన్నారు. పాడి రైతులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక పశు వైద్యాధికారి డాక్టర్ ఆర్.రమేష్, డాక్టర్ కె.ప్రసాద్, డాక్టర్ బి.చక్రధర్, సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

రైతులకు సాంకేతిక సలహాదారులుగా పని చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

రైతు సేవా కేంద్రాల్లో పనిచేస్తున్న విఎఎలు బిహెచ్ఎలు పంటలు సాగు చేస్తున్న రైతులకు ఎప్పటికప్పుడు తగు సలహాలు, సూచనలు ఇస్తూ సాంకేతిక సలహాదారులుగా పనిచేయాలని జిల్లా వ్యవసాయ శాఖ శిక్షణ సమన్వయకర్త ఆర్.శ్రీనివాసరావు అన్నారు. సోమవారం స్థానిక ఎడిఎ కార్యాలయంలో జరిగిన ఒకరోజు శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన అగ్రికల్చరల్, హార్టికల్చరల్ సహాయకులకు ఒకరోజు శిక్షణ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సీజన్లో రైతుల పొలాలను పరిశీలించి అవసరం మేరకు అప రాల సాగులో సస్యరక్షణ పద్ధతులను వివరించాలని, తెగుళ్ల నివారణా చర్యలపై వారికి అవగాహన కల్పించాలన్నారు. ఎడి టి.వెంకటేష్ మాట్లాడుతూ పొలంబడిలో పాల్గొంటున్న రైతు సేవా కేంద్రాలకు చెందిన సిబ్బంది అన్ని రిజిస్టర్ల మెయింటెనెన్స్, ఏడాదికి సంబంధించిన వివరాలు నమోదు చేయాలన్నారు. రస్తాకుటుంబాయి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసరాజు మాట్లాడుతూ ఆయిల్‌పాం సాగులో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధిగమించడానికి చేపట్టాలని పనుల గురించి వివరించారు. నీటి సదుపాయం ఉన్న రైతులు ఆయిల్‌పాం వేసుకునేందుకు ప్రోత్సహించాలని తెలిపారు. ఎడిఎ డిఆర్‌సి డి.భారతి మాట్లాడుతూ వరి పంట అనంతరం మడుల్లో మినుము, పెసర సాగులో మెలుకువలను వివరించారు. కార్యక్రమంలో పార్వతీపురం, సీతానగరం, బలిజిపేట మండలం ఎఒ పాల్గొన్నారు.

సౌత్‌జోన్ పోటీలకు విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - పాలకొండ

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ పరిధిలో గల ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలల్లో జరిగిన కబడ్డీ పోటీల్లో రాణించిన స్థానిక శ్రీ సత్య సాయి డిగ్రీ కళాశాలలో బిఎస్‌సి ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని బెహర ధనలక్ష్మి యూనివర్సిటీ స్థాయి సౌత్ జోన్ పోటీలకు ఎంపికైంది. ప్రతిభ చూపిన ఈమె ఈనెల 26 నుంచి చెన్నైలో జరగబోయే సౌత్ జోన్ కబడ్డీ పోటీలకు ఎంపికైంది. మరో విద్యార్థి అండర్-19 అథ్లెటిక్స్ 400 పరుగు పోటీల్లో జాక శివాని (బిఎ) రాష్ట్ర స్థాయిలో పోటీల్లో పాల్గొని జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించింది. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఉండాలని ప్రిన్సిపల్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను కాలేజీ మేనేజ్‌మెంట్ బి.లక్ష్మీనారాయణ, డివి రమణ, కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసరావు అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు అభినందించారు.

గ్రామైక్య మండల అధ్యక్షులుగా వరలక్ష్మి

ప్రజాశక్తి- సీతంపేట

సీతంపేట గ్రామైక్య మండల మహిళా అధ్యక్షులుగా కూరంగి వరలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యదర్శిగా కొండగొర్రె సావిత్రి, కోశాధికారిగా నిమ్మక రోజా రమణి, ఏకగ్రీవంగా ఎంపికయ్యారని ఎపిఎం కమల పాండియన్ తెలిపారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి -సీతానగరం

కాకినాడలో ఈనెల 1న వెల్ఫేర్ అసిస్టెంట్‌పై పెన్షన్ పంపిణీ విషయంలో జరిగిన దాడిని ఖండిస్తూ దాడి చేసిన వ్యక్తులపై తక్షణం చర్యలు తీసుకోవాలని, భద్రత కల్పించాలని కోరుతూ గ్రామ సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్లు ఎంపిడిఒకు సోమవారం వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, ఇటువంటి సంఘటన పునరావృతం కాకుండా సచివాలయ ఉద్యోగులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల సచివాలయ ఉద్యోగస్తులు పాల్గొన్నారు.

పంటల సాగుపై అవగాహన పెంచుకోవాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

పంటల సాగుపై రైతులు అవగాహన పెంపొందించుకోవాలని రస్తా కుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రం ప్రిన్సిపాల్, సైంటిస్ట్ డాక్టర్ ధ్రువ, ఆగ్రోనిమి సైంటిస్ట్ డాక్టర్ ఎస్ స్రవంతి, పెథాలజీ సైంటిస్ట్ డాక్టర్ అమృతవీణ రైతులకు సూచించారు. మండలంలోని నర్సిపురం ఎంటీయూ 1318 రకంలో ఎర్రవెన్నల ఎక్కువగా వచ్చి తాలు గింజలుగా కంకి ఉండిపోవటం గమనించి పానికల్ మైటు, చితిరాటు తెగుళ్లను గుర్తించారు. దీని నివారణకు పొట్ట దశలో ప్రోఫినో పోస్-2, ప్రొఫై కానా జోలు కలిపి పిచికారి చేయాలని, కంకి పైకి వచ్చే దశలో స్పైరన్ మెసేపిన్ రెండు లీటర్లు, నాట్‌వో 80 గ్రాములు ఎకరాకు కలిపి పిచికారి చేయాలని రైతులకు సూచించారు. ఈ రకం ఉధృతి ఎక్కువ ఉన్నందున రైతులు ముందుగానే గమనించుకొని 1318 రకానికి తప్పనిసరిగా పై సూచనలు పాటించి రెండు దపాలు పిచికారి చేసుకోవాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలకొండ ఎడిఎ రత్నకుమారి, స్థానిక ఎఒ సౌజన్య, మండల వ్యవసాయ విస్తీర్ణ అధికారి కృష్ణకాంత్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

సిహెచ్‌డబ్ల్యులకు వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి- పార్వతీపురం

ఐటిడిఎ పరిధిలో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు వేతనాలు చెల్లించాలని కోరుతూ వారు సోమవారం శ్రామిక మహిళా సంఘం నాయకులు ఇందిరా అధ్వర్యాన డిప్యూటీ డిఎం అండ్ హెచ్‌ఒ డాక్టర్ పద్మావతికి వినతిపత్రం అందజేశారు. ఆగష్టు నుంచి వేతనం బకాయి వుందని, ప్రతి నెలా పంపిణీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు జివి రమణ, హెల్త్ వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

గడువు పొడిగింపు

పార్వతీపురం: పిఎం యశస్వి పథకం గడువు ఈనెల 15 వరకు పొడిగించినట్లు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖాధికారి ఎస్.కృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి 9,10 తరగతులు, ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదువుతున్న బిసి, ఇబిసి, సంచార జాతుల కులాలకు చెందిన విద్యార్థులు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పిఎం యశస్వి పథకం కింద ఉపకారం వేతనాలు పొందేందుకు అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నామన్నారు. దరఖాస్తులతో పాటు కుల, ఆదాయ, పాఠశాల, కళాశాల ధ్రువీకరణ పత్రాలు ఆన్లైన్‌లో దరఖాస్తు చేయాలని పేర్కొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.2.50లక్షలు మించరాదన్నారు. పూర్తి వివరాలకు https://vet.nta.ac.in వెబ్సైటును సంప్రదించాలని ఆ ప్రకటనలో తెలిపారు.

రాజకీయ కక్షతో పింఛన్లు నిలిపివేయడం సరికాదు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

రాజకీయ కక్షతో పింఛన్లు నిలిపివేయడం సరికాదని సిపిఎం నాయకులు యమ్మల మన్మధరావు, గొర్లి వెంకటరమణలు అన్నారు. బలిజిపేట మండలం నారం నాయుడువలసకు చెందిన కంది గౌరీ శంకర్రావు, చల్లా పాపమ్మ, బోను సింహాచలం, లండ సింహాచలం, నాగళ్ల అప్పడు, చిన్ని అప్పల నరసయ్య, కొప్పిశెట్టి పారయ్య పింఛన్లను రాజకీయకక్షతో నిలిపి వేశారని ఇది అన్యాయమని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎఒకు వినతిపత్రం ఇచ్చారు. ఎఒ స్పందించి సంబందిత శాఖతో చరవాణిలో మాట్లాడారు. నాయకులు మాట్లా డుతూ ఏ ఆధారం లేక జీవనం సాగిస్తున్న వీరిని అర్హులుగా గుర్తించి గత కొన్నేళ్లుగాసామాజిక భద్రత పింఛన్లు ఇస్తున్నారని, ఇటీవల రాజకీయ కక్షలతో కావాలనే ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా కుంటి సాకులు చూపిస్తూ పింఛన్లు నిలిపివేశారని అన్నారు. నిలిపివేసిన పింఛన్లు ఇవ్వకపోతే ఎంపిడిఒ కార్యాలయం ముందు నిరసన చేస్తామని హెచ్చరించారు. వినతిని అందజేసిన వారిలో సిఐటియు జిల్లా అధ్యక్షులు డి.రమణారావు, పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి పాకల సన్యాసిరావు, బాధితులు పాల్గొన్నారు.

ఎఒకు వినతినిస్తున్న నాయకులు